సాక్షి జగిత్యాల
శుక్రవారం । 28 । జూలై । 2023



కోరుట్లలోని దేశాయినగర్ చుట్టూ చేరిన వర్షపునీరు



జగిత్యాలలో నీటమునిగిన వెంకటాద్రినగర్ కాలనీ

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అనంతారం రోడ్డాం వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామశివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును, గొల్లపల్లిరోడ్‌లోని శ్మశాటిక వాటికను పరిశీలించారు. భారీ వర్షాలకు వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న 51 కల్వర్టులు, బ్రిడ్జిలు నీటమునిగి రాకపోకలు స్తంభించిపోయాయని అన్నారు. వాహనదారులు వరద ప్రవాహాన్ని దాటేందుకు సాహసం చేయొద్దని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా పోలీసుశాఖపరంగా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు సాయం చేయడం జరుగుతుందని తెలిపారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్: లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహ ప్రాంతాలకు ప్రజలు వెళ్లొద్దని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. గురువారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న రోడ్డాంపై వెళ్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రహదారిపై వరదనీరు తగ్గేంత వరకు రాకపోకలు కొనసాగించవద్దని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, వరద ప్రాంతానికి ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీపీవో దేవరాజం, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

సహాయ కేంద్రాల ఏర్పాటు

జగిత్యాల: జిల్లాలో సహాయ పునరావాస కేంద్రాల ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్స్, పొన్నాల గార్డెన్స్, ఖిలాగడ్డ ముస్లిం కమ్యునిటీ, రాయికల్‌లోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, గొల్లపల్లి మండలంలో బొంకూర్ యాదవ కమ్యునిటీ భవనం, వెన్నుమట్లలో రైతువేదిక, ఇబ్రహీంనగర్‌లో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మెట్‌పల్లిలో కీర్తి ఫంక్షన్‌హాల్, ఆత్మకూర్‌లో జెడ్పీహెచ్ పాఠశాల, మల్లాపూర్‌లో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు ఏడు పునరావాస కేంద్రాల్లో 1065 మందికి ఆశ్రయం కల్పించి భోజనం, తాగునీరు, చద్దర్లతో పాటు, వైద్య సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో అత్యధికంగా 155.5 మి.మీ వర్షపాతం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 155.5 మి.మీ అత్యధికంగా వర్షపాతం నమోదైంది. బీమారం మండలం మన్నెగూడెంలో 154.0 మి.మీ, కథలాపూర్‌లో 153.3, బీమారం మండలం గోవిందారంలో 149.8, మేడిపల్లిలో 143.0, కోరుట్లలో 137.0, మల్లాపూర్‌లో 136.5 మి.మీ వర్షపాతం కురిసింది. దీంతో అధికారులు ఈ ప్రాంతాలను రెడ్‌అలర్ట్ జోన్లుగా ప్రకటించారు. అలాగే మెట్‌పల్లిలో 108.5, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 97.8, సారంగాపూర్‌లో 96.0, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 94.8, జగిత్యాల జిల్లా కేంద్రంలో 85.8, కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 71.5 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో అధికారులు ఈ ప్రాంతాలను గ్రీన్ అలర్ట్ జోన్లుగా ప్రకటించారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన ఆర్డీవో



ఎర్దండి వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి వద్ద గోదావరి ఉధృతిని మెట్‌పల్లి ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ రవీందర్‌రెడ్డిలు గురువారం పరిశీలించారు. గోదావరిలోకి ఎన్ని లక్షల క్యూసెక్కుల నీరు వస్తే నీళ్లు ఎక్కడి వరకు వస్తాయో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిశివారులోని ఇళ్ల ప్రజలను పాఠశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రవికిరణ్ జీకుమార్, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఉమాసాగర్, ఉప సర్పంచ్ బట్టు శేఖర్ ఉన్నారు.



జలదిగ్బంధంలో రాయికల్ పట్టణం



జగదేవుపేట-వెల్గటూర్ మధ్య వరదలో చిక్కుకున్న లారీ



రాగోజీపేట-వెంకట్రావుపేట గ్రామాల మధ్య తెగిన రోడ్డు



నీటమునిగిన జగిత్యాల మండల పరిషత్ కార్యాలయం



రాయికల్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు



నీట మునిగిన కొల్వాయి-అరెపల్లి ఎత్తిపోతల పథకం

అతలాకుతలం

- జిల్లాలో భారీ వర్షం
- జలదిగ్బంధమైన పట్టణాలు, గ్రామాలు
- ఉప్పొంగిన వాగులు, కూలిన ఇళ్లు
- స్తంభించిన రాకపోకలు
- ఇబ్బంది పడ్డ ప్రజానీకం
- సహాయక చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం

జగిత్యాల/కోరుట్ల/మెట్‌పల్లి/ధర్మపురి/కోరుట్ల రూరల్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పాటు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో జనజీనవం అతలాకులతమైంది. వాగులు ఉప్పొంగగా, చెరువులు మత్తళ్లు దూకాయి. బుధవారం రాత్రి భారీ వర్షం కురియడంతో వరద ముప్పు ఏర్పడింది. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాలు జలమయమయ్యాయి. పంట పొలాలన్నీ నీటమునిగాయి. ఎస్సారెస్పీ కాలువ పక్కన లోతట్టు ప్రాంతంలోని రబ్బానీపురాలో పలు ఇళ్లలోకి వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోవిందులపల్లిలోని వెంకటాద్రినగర్ పూర్తిగా జలమయం కాగా, 470 కుటుంబాలకు పట్టణానికి రాకపోకలు తెగిపోవడంతో ఇబ్బందికరంగా మారింది. రహదారులపై వరద నీరు ప్రవహించడంతో నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల హైవేలపై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కోరుట్లలోని వేంకటేశ్వర ఆలయం వద్ద బాత్‌రూం గోడ కూలి స్నానం చేస్తున్న బోచ్‌కారీ విజేత(29) మృతి చెందింది. కోరుట్ల పెద్దవాగు ఉధృతికి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్మశానవాటిక నీట మునిగింది. ప్రహరీ కొట్టుకపోయింది. వెన్నుమట్లలో వాగు ఉప్పొంగి ఎస్సీ, బీసీ కాలనీల్లోని 150కి పైగా ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇళ్లు ఖాళీ చేశారు. జగిత్యాల మండల పరిషత్ కార్యాలయం, ట్రాఫిక్ శిక్షణ కేంద్రం నీటిలో మునిగిపోయింది. బీమారం మండలం రాజలింగంపేటకు చెందిన దేశవేని లతకు పురిటినొప్పులు రాగా సమీపంలోని వాగు ఉప్పొంగడంతో జేసీబీ ద్వారా ఆమెను వాగు దాటించి కోరుట్ల ఆస్పత్రికి తరలించారు.

జలమయమైన పలు గ్రామాలు, కాలనీలు

లోతట్టు ప్రాంతాలైన గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. జగిత్యాలలోని లింగంపేట, గోవిందులపల్లి, అష్టలక్ష్మీనగర్, గోత్రాల కాలనీ, మార్కండేయనగర్‌తో పాటు, పలు కాలనీలు పూర్తిగా జలమయయ్యాయి. నిజామాబాద్ రోడ్ ప్రాంతంలో ఓ పురాతన ఇల్లు వర్షానికి నేలమట్టం అయింది. టవర్‌సర్కిల్, పోచమ్మవాడ, గంజ్‌రోడ్ పూర్తిగా జలమయం అయ్యాయి.కోరుట్ల శివారులోని శ్మశాన వాటిక, గంగమ్మతల్లి ఆలయం పూర్తిగా మునిగిపోగా దేశాయినగర్ చుట్టూ వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మెట్‌పల్లిలో మహాలక్ష్మీనగర్, బతుకమ్మ ఘాట్, చెన్నకేశవనాథ ఆలయం, శివాలయం పూర్తిగా మునిగిపోగా శివారు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.

అప్రమత్తమైన అధికారులు

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ వెళ్లే లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న నీరుతో మత్తడి పొంగి గోదావరిలో నీటిమట్టం పెరగడంతో అధికారులు అప్రమత్తం చేశారు. ముందస్తు జాగ్రత్తగా రాయపట్నం గోదావరినది వద్ద జాలరులను నియమించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. బీమారం మండలం రాజలింగంపేట గ్రామ శివారులో గోవిందరాజుల చెరువు తెగింది.

గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ప్రజల తరలింపు

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేయడంతో జిల్లాలోని ఆరు మండలాల్లోని 30 గ్రామాల గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రతీచోట వంతెనల వద్ద రోడ్లకు ఇరువైపులా ట్రాక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. 1,064 చెరువులకు 877 చెరువుల్లో ఫ్లస్ నీరు చేరిందని అధికారులు తెలిపారు. వెల్గటూర్ మండలం చెగ్యాంలో రోడ్లు తెగిపోవడంతో అక్కడు ఉన్న ఇళ్లలోకి నీరు చేరడంతో ఐదు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

గోదావరి ఉగ్రరూపం



ధర్మపురిలో ప్రమాద స్థాయికి గోదావరి

జగిత్యాలఅగ్రికల్చర్/ధర్మపురి: ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి వరద నీటిని గోదావరిలోకి భారీగా వదులుతుండటంతో గోదావరి ఉప్పొంగి ప్రమాదస్థాయికి చేరింది. పరివాహన ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, సారంగాపూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం కోరుతోంది. చేపల వేట, మేకలు, గొర్రెలను మేపేందుకు వెళ్లొద్దని, గోదావరి దాటే ప్రయత్నంచేయొద్దంటూ సమీప గ్రామాల్లో దప్పు చాటింపు చేస్తున్నారు. ధర్మపురిలో ప్రమాదస్థాయికి చేరి సంతోషిమాత ఆలయం చుట్టూ నీరు చేరింది. రూ.కోటితో నిర్మించిన శ్మశానవాటిక సగ భాగం నీటిలో మునిగింది. తీర ప్రాంత వాసులను అధికారులు అప్రమత్తంచేశారు.

మంత్రి కొప్పుల పరిశీలన



ధర్మపురిలో గోదాదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి/గొల్లపల్లి: ధర్మపురిలో గోదావరి వరద ఉధృతిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. తీర ప్రాంత వాసులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వాఉగలు, వంతెనలు, చెరువులు, కుంటలు పొంగి పార్లుతున్నందున మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లొద్దని సూచించారు. మంత్రి వెంట డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ చైర్మన్ రాజేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ తదితరులున్నారు. గొల్లపల్లి మండలం బొంకూర్, వెన్నుమట్ల గ్రామాల్లో నీట మునిగిన వరద బాధితులను మంత్రి పరామర్శించారు. వరద బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. ఆహారం, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేయాలని ఆదేశించారు.

స్తంభించిన రాకపోకలు

నేషనల్ హైవే నిజామాబాద్-జగిత్యాల, నేషనల్ హైవే 61పై చెరువులు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. అనంతారం గ్రామశివారులోని వాగు, మెతె వాగు ఉప్పొంగడం, ధర్మపురి మండలం ఆకసాయిపల్లె గుట్ట మలుపు వద్ద లోలెవల్ వంతెన పూర్తిగా నీట మునిగి ధర్మపురి-జగిత్యాల మధ్య రాకపోకలు నిలిచాయి. మేడిపల్లి జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఆత్మకూర్, రంగారావుపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో ప్రధాన రహదారులు జలమయం కావడంతో రాకపోకలు నిలిచాయి. మోహన్‌రావుపేట వద్ద జాతీయ రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించటంతో రెండు గంటలపాటు కోరుట్ల-జగిత్యాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. కోరుట్ల జాతీయ రహదారి, అయిలాపూర్ రోడ్, ఆదర్శనగర్, కల్లూర్‌రోడ్‌లో రాకపోకలు నిలిచిపోయాయి.



మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై వరద నీరు

ఇరుక్కుపోయిన ముగ్గురిని కాపాడిన గ్రామస్తులు

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం రాజలింగంపేట గ్రామశివారులోని కోళ్లఫారంలో పనిచేసే వ్యక్తులు గురువారం వరదనీటి ఉ. ధృతిలో ఇరుక్కుపోగా గ్రామస్తులు తాళ్లసాయంతో బయటకు తీసుకువచ్చారు. గోవిందరాజుల చెరువు తెగి వరదనీరంతా కోళ్లఫారం వైపు వచ్చింది. కోళ్లఫారంలో కూలీగా పనిచేస్తున్న ముగ్గురు అక్కడే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తుల సాయంతో తాళ్లతో వారిని బయటకు తీసుకవచ్చారు. పైడిమడుగు-రాయికల్ రహదారిలో ప్రవహించే ఒర్రెలో వరద ఉధృతికి ఆటోలో వెళ్తున్న కరెంటు మల్లయ్య,(57) ఆటోతో సహా కొట్టుకు పోగా స్థానిక యువకులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.



తాళ్లసాయంతో బయటకు తీసుకువస్తున్న గ్రామస్తులు



మెట్‌పల్లి చెన్నకేశవనాథ ఆలయంలోకి వరద నీరు



మెట్‌పల్లిలో నీట మునిగిన మహాలక్ష్మీ ఆలయం



సిరికొండ-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు



అంతర్గాంలో కూలిపోయిన ఇల్లు



కోరుట్ల పెద్దవాగు సమీపంలో మునిగిపోయిన శ్మశానవాటిక



గొల్లపల్లి మండలం వెన్నుమట్లలో నీట మునిగిన ఇళ్లు



గొర్రెపల్లిలో నీటమునిగిన జగిత్యాల-నిర్మల్ జాతీయ రహదారి

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి
- అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా



జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తవడం వల్ల గోదావరి పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, ఆ ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రానున్న 24 గంటల్లో వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఎత్తు గల బ్రిడ్జిలపై ప్రవహించే ప్రాంతాల్లో రవాణా ఆపేసి భారీకేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువులు తెగిపోయే పరిస్థితిని గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని పిల్లలు నీటి పరివాహక ప్రాంతాల్లో సెల్ఫీలు నిరోధించాలన్నారు. వలలు వేయకుండా చూడాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఒక ఇల్లు పూర్తిగా కూలిపోగా 94 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, సేవల కోసం 12 ఫోన్ కాల్స్ కంట్రోల్‌రూమ్‌కు వచ్చాయన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు టార్చిలైట్లు, తాడు, జకెట్స్, ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలు, ప్రజలు తిరగకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, పోలీసుల గస్తీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్‌లు దివాకర, లత మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటును పునరాలోలించాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: వీఆర్వో, వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే విషయంలో సీఎం కేసీఆర్ పునరాలోచన చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో అధికారులకు అండగా నిలిచేది వీఆర్‌ఏ, వీఆర్‌వోలేనని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 40వేల మందిని ఇతర శాఖల్లో సర్దు చేస్తే అదే సంఖ్యలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని అన్నారు. కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 23 కొత్త ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వీఆర్‌ఏ, వీఆర్‌వోలను తిరిగి వారి ఉద్యోగాల్లో నియమించి రెవెన్యూ శాఖను బలోపేతం చేయడంతో పాటు రేషన్‌కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా మారుస్తామని తెలిపారు. తహసీల్దార్లు భూముల రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో నిమగ్నమయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, రేపల్లె హరికృష్ణ, గుంటి జగదీశ్వర్, చాంద్‌పాషా, జున్ను రాజేందర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రజలను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇళ్లు కూలిపోయిన వారిని గృహలక్ష్మి పథకం కింద ఆదుకుంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత, పిల్లలు చెరువుల వద్దకు చేపల కోసం వెళ్లవద్దని సూచించారు. మున్సిపల్ రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ గోలి శ్రీనివాస్, నరేశ్, రాజేశ్వర్ ఉన్నారు.

జేసీబీ సాయంతో రోడ్డు దాటింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లత

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన దేశవేని లత అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం వెళ్తుండగా గంభీర్‌పూర్ శివారులో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు జేసీబీ సాయంతో గర్భిణిని వరద నీటి నుంచి దాటించారు. అనంతరం అంబులెన్స్‌లో కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వైద్యసిబ్బంది పరీక్షించి కోరుట్లలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. సిరికొండ శివారులో రోడ్డుపై నీటిప్రవాహం ఎక్కువగా ఉండగా ట్రాక్టర్ సాయంతో అంబులెన్స్‌ను రోడ్డు దాటించి కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు.

ఇళ్లు కోల్పోయిన వారిని ఆదుకోవాలి



ముంపు కాలనీల్లో పర్యటిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాల: భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరి ఇళ్లు కూడా కూలిపోయాయని, వారిని వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని పలు కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీలకు నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇళ్లు కోల్పోయిన వారిని వెంటనే ఆదుకోవాలన్నారు.

నియామకం

మెట్‌పల్లి: భారత జాగృతి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పోతారపు రమేశ్‌ను నియమించినట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్ గురువారం తెలిపారు. జిల్లాలో జాగృతి బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని ఈ సందర్భంగా రమేశ్ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నంబర్ వన్

- జిల్లాలో సహకార సంఘాల ద్వారా 252 కేంద్రాలు ఏర్పాటు
- రూ.29.49 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు
- రూ.607.52 కోట్ల ధాన్యం సేకరణకు రూ.9.43 కోట్ల కమీషన్



జగిత్యాల సహకార సంఘం

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లలో సహకార సంఘాలు యాసంగి సీజన్‌లో రూ.607.52 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాయి. రాష్ట్రంలోనే సహకార సంఘాల ద్వారా అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లా జగిత్యాల కావడం విశేషం. ఒకప్పుడు రైతులకు పంట రుణాలు ఇవ్వడం, తీసుకోవడానికే పరిమితమైన సహకార సంఘాలు, ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ కమీషన్ రూపంలో మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. అంతేకాకుండా సహకార సంఘంలోని సభ్యులైన రైతులకు ఇబ్బందులు కలుగకుండా, ఎక్కడికక్కడే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

252 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలోని సహకార సంఘాల ద్వారా గ్రామాల్లో 252 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 306 గ్రామ పంచాయతీలుండగా చిన్న గ్రామాలను మినహాయించి, అన్ని గ్రామ పంచాయతీల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రం పరిధిలోని రైతుల ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2.060 చొప్పున కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు పంపించారు. జిల్లా సహకార అధికారుల పర్యవేక్షణలో సహకార సంఘం చైర్మన్లు, డైరెక్టర్లు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను రోజూ పర్యవేక్షించి, కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూశారు.

29.49 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

యాసంగి సీజన్‌లో వరిపంట సాగులో ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో, రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరిని సాగుచేశారు. దీంతో అనుకున్న స్థాయిలో జిల్లాలో ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడంతో, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాల కంటే ముందే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. యాసంగిలో 39,025 మంది రైతుల నుంచి, రూ 607.52 కోట్ల విలువ గల 29.49 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేశారు.

రూ.9.43 కోట్ల కమీషన్

వరి ధాన్యం కొనుగోలు చేసినందుకు సివిల్ సప్లై సంస్థ సహకార సంఘాలకు క్వింటాల్‌కు రూ.32 కమీషన్ ఇస్తుంది. ఇలా జిల్లాలోని సహకార సంఘాలకు రూ. 9.43 కోట్ల కమీషన్ రానుంది. సహకార సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి, పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఆ మేరకు కమీషన్ డబ్బులు వస్తాయి. దీంతో సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చేసేందుకు పోటీపడ్డాయి. కొనుగోలు సీజన్ పూర్తికాగానే, కమీషన్ డబ్బులు అందించాల్సిన సివిల్ సప్లై సంస్థ తాత్సారంతో ప్రతి సంఘానికి ఇవ్వాల్సిన డబ్బులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ధాన్యం కొనుగోలు కమీషన్ డబ్బులతో మరిన్ని వ్యాపారాలు చేసేందుకు సహకార సంఘాలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారంలో ఉన్న సంఘాలు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. గ్రామాల్లో సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు, కూలీల శ్రమను తగ్గించేందుకు ఆధునిక పరికరాలు కొనుగోలు చేసి, రైతులకు అద్దెకిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. రైతుల ధాన్యం నిల్వ చేసేందుకు, ఎరువుల బస్తాల నిల్వకోసం గోదాంలు నిర్మిస్తున్నారు. పంట రుణాలే కాకుండా వాహన, బంగారం తాకట్టు రుణాలు, విదేశీ విద్యా రుణాలు కూడా ఇస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు

మండలం	కొనుగోలు చేసిన ధాన్యం
బీర్‌పూర్	71,328
బుగ్గారం	70,207
ధర్మపురి	2,57,371
గొల్లపల్లి	2,26,217
ఇబ్రహీంపట్నం	1,27,659
జగిత్యాల రూరల్	1,03,154
జగిత్యాల అర్బన్	44,074
కథలాపూర్	2,27,888
కొడిమ్యాల	1,34,717
కోరుట్ల	1,79,902
మల్లాపూర్	1,35,886
మల్యాల	1,59,621
మేడిపల్లి	2,16,537
మెట్‌పల్లి	2,29,731
పెగడపల్లి	2,46,720
రాయికల్	1,40,624
సారంగాపూర్	1,01,727
వెల్గటూర్	2,75,769

మంచి ఆదాయం



వరి ధాన్యం కొనుగోళ్లు సహకార సంఘాలకు వరంగా మారాయి. గతంలో ఎలాంటి ఆదాయం లేక సహకార సంఘాలు మూతపడే పరిస్థితి నెలకొంది. మా సహకార సంఘం పరిధిలోనే దాదాపు 10 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మంచి ఆదాయం సంపాదించాం.

– మహిపాల్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్,

ధాన్యం కొనుగోళ్లలో పోటీ



సహకార సంఘాలు ధాన్యం కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నాయి. కొన్ని సంఘాలు ఆ సంఘాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఐకెపీకి పోటీగా కొనుగోలు చేస్తున్నాయి. కమీషన్‌లో వచ్చిన డబ్బులను సంఘం సభ్యులు చర్చించి, వ్యాపారాలు చేసేందుకు ఉపయోగిస్తున్నారు.

– రామానుజాచారి, జిల్లా సహకార అధికారి, జగిత్యాల

రైలు ప్రయాణంలో తకరారు

- బల్లార్ష–ఖాజీపేట సెక్షన్‌లో రైళ్లు రద్దు
- వరంగల్ వరకే తిరుపతి–కరీంనగర్ రైలు
- కొన్ని దారి మళ్లింపు, ఇంకొన్ని పాక్షికంగా రద్దు
- ప్రయాణికుల ఇబ్బందులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్నింటిని అధికారులు పాక్షికంగా రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లించారు. ఈ ఆకస్మిక పరిణామంతో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రద్దు, పాక్షిక రద్దు, దారి మళ్లిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి..

- సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ గురు, శుక్రవారాల్లో రద్దయ్యాయి.
- సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దవగా శుక్రవారం ఉదయం కూడా రద్దు చేశారు.
- సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఘన్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నడుపుతున్నారు. ఘన్‌పూర్–కాగజ్‌నగర్ వరకు రద్దు చేశారు. ఈ మూడు రైళ్ల వల్ల నిత్యం హైదరాబాద్ వెళ్లాల్సిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- తిరుపతి–కరీంనగర్ బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్‌కే పరిమితం చేశారు. వరంగల్–కరీంనగర్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. పిల్లాపాపలతో తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా లగేజీతో వర్షంలో తడుస్తూ తిరిగి బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.
- సికింద్రాబాద్–పాట్నా వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి, రామగుండం నుంచి వెళ్లాల్సి ఉండగా విజయవాడ మీదుగా దారి మళ్లించారు.
- చెన్నై–అహ్మదాబాద్ వెళ్లాల్సిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, మంచిర్యాల కాకుండా వాడి–సికింద్రాబాద్ మీదుగా మళ్లించారు.
- న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా–ఆదిలాబాద్–ముత్కేడ్ జంక్షన్ మీదుగా నిజామాబాద్ నుంచి దారి మళ్లించారు.
- గోరక్‌పూర్–సికింద్రాబాద్ రైలును పెద్దపల్లి–కరీంనగర్– నిజామాబాద్ మీదుగా దారి మళ్లించారు.

గోదావరి తీర ప్రాంతాలపై సర్కార్ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న క్యాతం వెంకటరమణ

ధర్మపురి : గోదావరి తీర ప్రాంతాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోందని గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ క్యాతం వెంకటరమణ అన్నారు. ధర్మపురిలో గోదావరిని గురువారం గోదావరి హారతి ఉత్సవ సమితి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి తీర ప్రాంత ప్రజలపై ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఖండిస్తున్నామన్నారు. గతంలో వరద ప్రవహించనప్పటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదన్నారు. బుధవారం కడెం ప్రాజెక్ట్ వద్ద ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేసిన హడావుడి హాస్యాస్పదంగా ఉందన్నారు. గత సంవత్సరం ధర్మపురి, గోదావరిఖని, మంథని, మంచిర్యాల ముంపునకు గురైతే ఏరియల్ సర్వేచేసిన సీఎం కేసీఆర్ వెయ్యి కోట్లు ప్రకటించారని, అవన్నీ నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఆరోపించారు. జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, సభ్యులు సంగి నర్సయ్య, బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, గాజు భాస్కర్ తదితరలున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలానికి చెందిన జీల రాజు(37) మంకమ్మతోటలో ఓ ట్రావెల్స్ నడుపుతూ కుటుంబసభ్యులతో శ్రీనగర్ కాలనీలో ఉంటున్నాడు. రాజుకు తెలిసిన వ్యక్తి అబ్దుం హకీం గురువారం ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయలేదు. అతని ట్రావెల్స్‌కు వెళ్లి చూడగా తలుపు పెట్టి ఉంది. ఫోన్ ఎత్తకపోవడం, తలుపు కొట్టినా తీయకపోవడంతో స్థానికులను పిలిచాడు. వారు వచ్చి తలుపు తెరిచి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. రాజు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వచ్చి, అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఈశ్వర్

జగిత్యాల: రెండ్రోజులనుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా జిల్లాలో కురిసిన వర్షపాతం, నష్టాలపై మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 1069 చెరువులకు గాను 877 చెరువులు పూర్తిగా నిండి జలకళ సంతరించుకున్నాయన్నారు. 9 చెరువులు దెబ్బతిన్నాయని, జిల్లాలోని 10 పునరావాస కేంద్రాల్లో 1100 మందికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ, కడెం, పలు ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నందున నీటి విడుదలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు బీఎస్. లత, దివాకర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సత్యనారాయణ సేవలు మరువలేనివి'



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జడ్జి శ్యామ్‌ప్రసాద్

ధర్మపురి : సీనియర్ న్యాయవాది, తిర్మందాస్ సత్యనారాయణ సేవలు మరువలేనివని జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ధర్మపురిలోని కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి శ్యామ్‌ప్రసాద్ సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అలుక వినోద్, కార్యదర్శి బందెల రమేశ్, రామడుగు రాజేశ్, న్యాయవాదులు జాజాల రమేశ్, ఇమ్మడి శ్రీనివాస్, బత్తిని ఇంద్రకరణ్, కస్తూరి శరత్, తదితరులున్నారు.

కూలిన పీపుల్స్‌వార్ శంకరన్న ఇల్లు

- ఉత్తర తెలంగాణ కార్యదర్శిగా పనిచేసిన దొంత మార్కండేయ
- ఇంట్లో ఎవరు లేకపోవడంతో తప్పిన ప్రమాదం



కూలిన శంకరన్న నివాసం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అప్పటి పీపుల్స్‌వార్ కార్యదర్శిగా పనిచేసిన దొంత మార్కండేయ ఉరఫ్ శంకరన్న ఇల్లు గురువారం కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శంకరన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో 1993 జనవరి 25న రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఈ మధ్యనే శంకరన్న పాత్రతో కూడిన విరాటపర్వం సినిమా తెరకెక్కించారు. శంకరన్న పాత్రలో దగ్గుబాటి రాణా హీరో పాత్ర పోషించారు.మూడు దశాబ్దాల క్రితం ఉద్యమానికి ఆకర్షితుడై పార్టీలోచేరి ఉత్తర తెలంగాణ కార్యదర్శి స్థాయిలో ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. ఆయన జ్ఞాపకంగా ఉన్న ఒక్క ఇల్లు కూలిపోవడంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

భయపెడుతున్న ఆస్పత్రి భవనం

- వర్షాలతో ఉరుస్తున్న బిల్డింగ్
- పెచ్చులూడుతున్న పైకప్పు
- జిక్కుజిక్కుమంటున్న పేషెంట్లు
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దుస్థితి



ఆస్పత్రి ఎదుట పెచ్చులూడుతున్న పైకప్పు



ఆస్పత్రిలో రోగులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం ఏళ్లక్రితం నిర్మించారు. మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉరుస్తూ పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. గతేడాది జనరల్ వార్డు పైకప్పు పెచ్చులూడి పడటంతో కొందరు పేషెంట్లు తీవ్రగాయాల పాలయ్యారు. జనరల్ వార్డు, ఆరోగ్యశ్రీ వార్డు, వరండాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది.

వెయ్యి మందికిగా పైగా అవుట్ పేషెంట్లు..

- జనరల్ ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారు.
- దీంతో జిల్లావ్యాప్తంగా వివిధ వ్యాధులతో బాధపడే ప్రజలు వైద్య సేవల కోసం ఇక్కడకే వస్తున్నారు.
- రోజూ సుమారు వెయ్యి మందికి పైగానే అవుట్ పేషెంట్లు, 200 మందికి పైగా ఇన్‌పేషెంట్లు వస్తున్నారు.
- బంధువులు కూడా వీరి వెంటే ఉంటున్నారు.
- ప్రస్తుతం కురుస్తున్న ముసురువానతో అన్నివార్డులు తడిసిపోయాయి.
- దీనికితోడు ఎక్కడ చూసినా పైకప్పులు ఉరవడంతో నేల తడిగా మారి కనీసం కూర్చునే అవకాశం లేదు.

చిన్న మరమ్మతులతో పరిష్కారం..

పురాతన భవనమైనా ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నపాటి మరమ్మతులు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు, పేషెంట్లు అభిప్రాయపడుతున్నారు. కానీ, ప్రజాప్రతినిధులు, వైద్య, ఆరోగ్య శాఖ ఈ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పీవోపీ వేయించినా..

- భవనానికి మరమ్మతులు చేయకుండానే వరండా, పలు వార్డులు తదితర ప్రాంతాల్లో పీవోపీ చేయించారు.
- ప్రస్తుత వర్షాలతో పైకప్పు ఉరవడంతో పీవోపీ పనికిరాకుండా పోతోంది.
- విద్యుత్ బోర్డులు, స్విచ్చుల్లో వర్షపునీరు చేరి విద్యుత్ షాక్ కొడుతోందని పేషెంట్లు, సిబ్బంది భయపడుతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి భవన మరమ్మతు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

గోడ కూలి మహిళ మృతి



విజేత మృతదేహం

కోరుట్ల: స్నానం చేసేందుకు వెళ్లిన ఓ మహిళ భారీ వర్షానికి బాత్‌రూం గోడ కూలి అక్కడేక్కడే మృతిచెందిన సంఘటన కోరుట్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని వేంకటేశ్వరాలయం సమీపంలో పాత ఇంట్లో నివాసముండే బోచ్‌కారీ కాశీరాం (35) రేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. కాశీరాంకు భార్య విజేత (29), మూడేళ్లు, ఐదు సంవత్సరాల ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం విజేత స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బాత్‌రూం గోడ తడవడంతో ఒక్కసారిగా కూలింది. కుటుంబ సభ్యులు మట్టి, ఇటుకలను తొలగించి విజేతను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు డా. కల్వకుంట్ల సంజయ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ పరామర్శించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్



వరద బాధితులతో మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి: భారీ వర్షాలతో నీటమునిగిన వరద బాధిత కుటుంబాలను మంత్రి ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని వెన్గుమట్ల, బొంకూర్ గ్రామాల్లో నీట మునిగిన ఇళ్లను పరిశీలించి పలువురిని పరామర్శించారు. వారి పరిస్థితి గురించి కలెక్టర్ యాస్మిన్ బాషాతో మాట్లాడారు. తక్షణ సాయం ప్రకటించి సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. కొంత కాలంగా పేద దళితులు ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా వారికి శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు.నష్టపోయిన పేద ప్రజలకు రూ.2 లక్షలు, డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న సీఎం కేసీఆర్ కనీసం దళిత వాడల్లో పేదప్రజల సంక్షేమానికి పాటుపడకపోవడం విడ్డూరమన్నారు. వరద బాధితులను ఆదుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఆకట్టుకున్న పులి వేషధారుల సందడి



జగిత్యాలటౌన్ : పట్టణంలోని మోచీబజారులో పెద్ద పులి వేషధారుల సందడి ఆకట్టుకుంది. మూడు రోజులుగా ఎడ తెరిపిలేని వర్షాలతో మొహర్రం సంబరాలు కనిపించలేదు. గురువారం సాయంత్రం వర్షం తెరిపి ఇవ్వడంతో పట్టణంలోని మోచీబజార్, టవర్ ప్రాంతంలో పులివేషధారుల సందడి ఆకట్టుకుంది.